

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

గజ్వేల్, మార్చి 9: ప్రభుత్వ గురుకుల పాలిటెక్నిక్ కళాశాలలో(జీఎంఆర్) అట్టహాసంగా పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఆదివారం జరుపుకొన్నారు. 1988 నుంచి 2021 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 25 ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడంతో వారు గత అనుభవాలను పంచుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం పాల్గొనగా సమ్మేళనం విజయవంతం కావడంపై ప్రోగ్రాం కన్వీనర్ భాస్కర్, మీడియా కోఆర్డినేటర్ బాలప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు.

మహాపాదయాత్రకు స్వాగతం

పాదయాత్రగా వస్తున్న భక్తులు

రాయపోల్, మార్చి 9: సద్గురు సిద్ధలింగేశ్వరస్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాపాదయాత్ర ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈయాత్రకు గ్రామస్తులు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. యాత్రలో నాగభూషణస్వామిజీ (దామరమండ), సంతోష్‌స్వామిజీ (గుంతకల), బసవరాజస్వామిజీ (ధర్మాబాద్, బీదర్), రాజాస్వామిజీ (కర్ణాటక), సిద్ధేశ్వర మహారాజ్ (వాణిజవాడ), రామదాస్‌స్వామిజీ (బరంగి పెద్ది) పాల్గొన్నారు. యాత్రికులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయడంతో పాటు భక్తులచే పాదపూజ, భజనలు, హారతులు నిర్వహించారు. స్వామీజీలు తమ ప్రవచనంలో రామాయణం, మహాభారతం, భక్తి మార్గం వంటి విషయాలను వివరించారు. మండల కేంద్రంలో జీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్ యజమాని గల్వా దయాకర్‌రెడ్డి యాత్రికులు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాయపోల్ అయ్యవారు జంగం మాణిక్యప్రభువు, హిందూ ధర్మ పరిరక్షణ నాయకులు రవీందర్‌రెడ్డి, లింగారెడ్డి, బాలలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన

రాయపోల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయపోల్ . మార్చి 9: వివిధ గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పులతో ఆదివారం భారీగా మండల కేంద్రానికి తరలివచ్చారు. రాయపోల్‌లో వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు అయ్యగల్ల రవి ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింహులు హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బందారం సంతోష్, ప్రధాన కార్యదర్శి టెంకంపేట నర్సింహులు, మాజీ సర్పంచ్ రామోల్ల స్వామి, చిరంజీవి, మండల కోశాధికారి లక్ష్మణ్, తుడుం నర్సింగరావు, ప్రకాశ్, సాయిలు, అయ్యగల్ల రవి, వివిధ గ్రామాల అధ్యక్షులు తుడుం స్వామి, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

పూజా కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 9: హుస్నాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరస్వామి గుట్టపై నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతిపూజ, పుణ్యవచనం, పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు, గణపతిహోమం, దివ్య పదనెట్టాంబడి పూజ వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్‌మాజీవైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులు, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, సింగిల్ విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితాశ్రీనివాస్‌రెడ్డిదంపతులు, ఆలయకమిటీకి చెందిన బుచ్చిరెడ్డి, కుంట మల్లయ్య, నవీన్‌రావు, శివారం, శ్రీకాంత్, ప్రసాద్, నాగభూషణం, రాజు, పూజారి భానుమూర్తి ఉన్నారు. గుట్టపై వెలిసిన శ్రీసిద్ధేశ్వరస్వామి, అంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు సైతం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు



సీతారామస్వామిని దర్శించుకుంటున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి,నాయకులు

మర్కూక్,మార్చి 9: మండలంలోని పాములపర్తిలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం విమానగోపురం ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, దేవతామూర్తుల కల్యాణం,సామ్రాజ్య పట్టాభిషేకం, పూర్ణాహుతి, మహానివేదనం, రుత్విక్‌సన్మానం జరిగింది. సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకొని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి దేవతామూర్తులను దర్శించుకున్నారు. సోమవారం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ హనుంతారావు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడుదాం

సిద్దిపేట కమాన్, మార్చి 9 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో మహిళల హక్కుల కోసం పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో కార్మిక కర్షక భవనంలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మహిళా కార్మికులు చేసిన పోరాటాల ఫలితంగా ప్రతి సంవత్సరం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసే మహిళలు లైంగిక వేధింపులు, హింసను ఎదుర్కొంటున్నారన్నారు. మూడింట ఒక వంతు మంది మహిళలు గృహహింసకు గురవుతున్నారని గుర్తుచేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, కోశాధికారి భాస్కర్, సహాయ కార్యదర్శి మహేశ్, సుభద్ర, మనోహరి, కల్పన, సుధారాణి, లక్ష్మి, సంధ్యారాణి, మమత, కృష్ణవేణి, పావని, ఫాతిమా, వరకుమారి, రజని తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

గుంతలమయంగా బీటీ రోడ్లు

• నరకం చూస్తున్న ప్రయాణికులు • పట్టించుకోని అధికారులు

గుంతలమయమైన మిరుదొడ్డి నుంచి అందె వరకు వెళ్లే బీటీరోడ్డు

మిరుదొడ్డి నుంచి కాసులాబాద్, మోతె గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు

మిరుదొడ్డి, మార్చి 9 : బీటీ రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు నరకాన్ని అనుభవిస్తున్నారు. మిరుదొడ్డి మీదుగా అందె గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణం చేయడానికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వందలాది వాహనదారులు నిత్యం ప్రయాణం కొనసాగిస్తుంటారు. రోడ్డు సక్రమంగా లేక రాత్రి సమయంలో గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై గాయాలపాలైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. మిరుదొడ్డి నుంచి కాసులాబాద్, అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె, చిట్టాపూర్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డుపై గుంతలుపడి పెద్ద పెద కంకరరాళ్లు తేలడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, సంబంధితశాఖ అధికారులు వెంటనే స్పందించి బీటీరోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించడమే ధ్యేయం

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యే పల్లాను కలిసిన చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్, నాయకులు

చేర్యాల, మార్చి 9 : చేర్యాలకు పూర్వ వైభవం తీసుకురావాలంటే డివిజన్ కేంద్రం ఏర్పాటే శరణ్యమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం చేపట్టిన కార్యచరణలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చేర్యాల రెవెన్యూ డివిజన్ కేంద్రం అంశాన్ని ప్రస్తావించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే పల్లా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు తన ధ్యేయమని, అసెంబ్లీ ఎన్నికల్లో చేర్యాల ప్రాంత ప్రజలు తనకు అత్యధికంగా ఓట్లు వేసి అక్కున చేర్చుకున్నారని, డివిజన్ కేంద్రం ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తానని హామీ ఇచ్చారు.బీఆర్ఎస్ సర్కారు పాలనలో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కావాల్సిన అన్ని వసతులు సైతం ఏర్పాటు జరిగిందని, కాంగ్రెస్ సర్కారు జీవో విడుదల చేసి, పోలీస్, ఆర్డీవో కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు, నాయకులు బాల్‌నర్సయ్య, ఆముదాల మల్లారెడ్డి, సురేశ్‌గౌడ్, ఒగ్గు రాజు, శ్రీధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, మిట్టపల్లి నారాయణరెడ్డి, పొతుగంటి రాందాస్ ఉన్నారు.

కోడెల స్తంభం వద్ద పారుతున్న మురుగు

కోడెల స్తంభం ప్రదేశంలో ఏరులై పారుతున్న మురుగు

• ఇబ్బందులు పడుతున్న భక్తులు
• రెండున్నర నెలలుగా ఇదే తంతు

చేర్యాల, మార్చి 9 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలోని కోడెల స్తంభం వద్ద మురుగు ఏరులైపారుతున్నా ఆలయవర్గాలు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం నుంచి రెండున్నర నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లుకూడా లేదు నాలుగు వారాల క్రితం మరమ్మతులు చేసేందుకు జేసీబీతో గుంతలు తీసి పైపులు వేసి పనులు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలిపెట్టారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వామివారి దర్శనం కోసం ఎంతో పవిత్రంగా ఇంటి నుంచి వచ్చి కోడెల స్తంభం ప్రదేశంలో తమ వాహనాలు పార్కు చేసుకుని సామగ్రి కొనుగోలు, షాపింగ్, దర్శనాలు తదితర వాటికి వెళ్లే భక్తులు సదరు నీటిని గమనించకుండా వెళ్లిపోతున్నారు. మురుగు పారుతున్నా అధికారులు, సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏరులై పారుతున్న డ్రైనేజీ సైతం ఎంపీడీవో కార్యాలయం ముందే ఉన్నా అక్కడ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది సైతం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో సైతం పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు హామీ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఎనిమిదో ఆదివారం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో స్వామివారి క్షేత్రంలోని ఆలయ గదులతో పాటు ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన గదుల నుంచి భారీగా మురుగు బయటకు రావడంతో కోడెల స్తంభం వీధి మొత్తం మురుగుమయమైంది. అధికారులు స్పందించి మురుగు పారుతున్న పైపులకు మరమ్మతులు చేసి నీటిని బయటకు వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో కె.రామాంజనేయులును ఫోన్‌లో 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా మురుగు ప్రవహిస్తున్న విషయాన్ని జిల్లా పంచాయతీశాఖ అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులకు తెలియజేశామన్నారు. మరమ్మతు చేసేందుకు పైపులు తదితర సామగ్రి కావాలంటే ఆలయ నిధుల నుంచి కేటాయించామని అయిన్నప్పటికీ మరమ్మతులు చేయలేదన్నారు.

గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నవాజ్‌మీరా

విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

గజ్వేల్, మార్చి 9: కేసీఆర్‌పై విమర్శలు మానుకొని గజ్వేల్ అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేలా స్థానిక కాంగ్రెస్ నాయకులు దృష్టి సారించాలని, పదిహేను నెలల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యమని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా అన్నారు. ఆదివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలో ఉండి అభివృద్ధి చేయడం చేతకాక విమర్శలు చేయడం మూర్ఖత్వమని, గజ్వేల్ అభివృద్ధి కోసం రూ.170కోట్లకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపిలను అందజేస్తే ఆ నిధులను తీసుకురావడంతో కాంగ్రెస్ నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు. 2014కు ముందు గజ్వేల్ ఎలా ఉండే ఇప్పుడు ఎలా ఉందో నియోజకవర్గ ప్రజలకు తెలుసునని, కావాలంటే గ్రామాల్లోకి వెళ్లి కేసీఆర్ చేసిన అభివృద్ధి తెలుసుకోవాలని హితవు పలికారు. స్థాయిని మించి విమర్శలు చేయడం తగదని, మాట్లాడే ముందు ఎవరి అర్హత ఎందో తెలుసుకోవాలన్నారు. రైతాంగం కోసం కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టును నిర్మించి సాగునీటి అందించడంతో పాటు తాగునీటిని అందించి ఈ ప్రాంతం అభివృద్ధిలో కేసీఆర్ చేరగని ముద్ర వేశారన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు రావాల్సిన ప్యాకేజీలు ఇప్పిస్తామని, ఏడాదిలో కాలనీల్లో పర్యటించి వారికి ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషియన్ కిట్లను అందించడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మాతాశిశు దవాఖానను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు చందు, కనకయ్య, మల్లేశం, శ్రీధర్, నాయకులు ఉమార్,నిజాం, శివకుమార్, హనుమంతరెడ్డి, అక్రమ్, స్వామి పాల్గొన్నారు.

శిథిలావస్థలో గోదాం

కడవేర్గులో శిథిలావస్థకు చేరుకున్న గోదాం

చేర్యాల, మార్చి 9 : సర్కారు నిర్లక్ష్యం వల్ల రైతులకు ఉపయోగపడే గోదాం శిథిలావస్థకు చేరుకుంది. మండలంలోని కడవేర్గులో మూడు దశాబ్దాలుగా రైతుల పంటలకు ఎరువులు అందించిన గోదాం నేడు శిథిలమైంది. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ ఎరువుల బస్తాలు గోదాంకు రాక రైతులు మండల కేంద్రానికి వచ్చి ఎరువులు తీసుకుపోతుండంతో వారికి భారంగా మారింది. గ్రామంలో ఉన్న నాయకులు గోదాం వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. నాయకులు పదవులపై ఆరాటం తప్పా గ్రామాభివృద్ధి గురించి ఆలోచించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే గోదాంకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ యువకులు కోరుతున్నారు.

చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్, మార్చి 9: చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని భారత్ నగర్‌కు చెందిన జక్కా నితిన్‌కు ఆదివారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన నితిన్ ఆర్‌వీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. దోస్తాంకా గ్యారేజ్ స్నేహితులు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సంతోష్, ఆనంద్, శ్రీనివాస్, పెద్దూరి శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లన్నకు కోటిదండాలు

కొమురవెల్లి రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో తదితరులు

ఎనిమిదో ఆదివారానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్న భక్తజనం

చేర్యాల, మార్చి 9 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు మల్లన్నక్షేత్రానికి భక్తులు తరలివస్తున్నారు. ఉత్సవాల ఎనిమిదో ఆదివారం సందర్భంగా 50వేల మందికి పైగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు.స్వామి వారి క్షేత్రానికి వచ్చి న భక్తులు ఆలయ నిర్వహణలో ఉన్న గదులు, ప్రైవేట్ గదులు అద్దెకు తీసుకుని అందులో బస చేశారు.శనివారం రాత్రి క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆదివారం వేకువజామున నిద్రలేచి గదుల్లో పవిత్ర స్నానం ఆచరించి స్వామి వారి దర్శనం కోసం క్యూలో నాలుగు గంటలు వేచి ఉన్నారు.ధర్మదర్శనానికి రెండుగంటలు, శీఘ్ర దర్శనానికి మూడున్నర గంటలు, వీవీఐపీ దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. స్వామి వారి దర్శనం అనంతరం గంగరేగుచెట్టు వద్ద ముడుపులు, ప ట్నం, మరికొందరు తాము బస చేసిన గదుల వద్ద, మహామండపంలో పట్నాలు వేయించి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి ఒడి బియ్యం, అభిషేకం, అర్చన, బోనాలు తదితర పూజలు నిర్వహించారు.ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ రెడ్డి, ప్రధానార్చకుడు మల్లికార్జున్, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలందించారు.హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై నాగరాజు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వేసవిలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.

గట్టు రవీందర్ మృతిపై హరీశ్‌రావు సంతాపం

సిద్దిపేట, మార్చి 9: సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గట్టు రవీందర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆదివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. రవి మృతి బాధాకరమని, తీవ్ర దిగ్భ్రాంతిని కలగజేసిందన్నారు. సిద్దిపేట వైశ్య సంఘం అధ్యక్షుడిగా పనిచేసి సంఘం బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ఆధ్యాత్మిక, ధార్మిక సేవలో ముందుండి సామాజిక సేవలో భాగస్వాములయ్యారని గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, రవి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చెట్టును ఢీకొట్టిన కారు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 9 : నిద్రమత్తులో కారు చెట్టును ఢీకొట్టిన ఘటన కొండపాక శివారులోని రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన సందీప్, అనిల్ హైదరాబాద్ నుంచి ధర్మపురికి దైవదర్శనం కోసం ఆదివారం ఉదయం వెళ్తున్నారు. కొమురవెల్లి కమాన్ దాటిన తర్వాత నిద్రమత్తులో రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ఘటనలో అనిల్‌కు తీవ్రగాయాలుకాగా సందీప్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

రైతులను ఆదుకోవాలి

చేర్యాల, మార్చి 9 : పార్టీ నాయకులతో సంబంధం లేకుండా నీటి కష్టాల నుంచి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అధికారులను డిమాండ్ చేశారు.ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంతంలోని గ్రామాల్లో సాగు, తాగు నీటి ఎద్దడిని తట్టుకోలేక పంటలు, ప్రజలు అల్లాడిపోతున్నారని, ముందు చూపు లేని పాలకులు, నాయకులు చేసిన అన్యాయమే ఈ పరిస్థితికి కారణమన్నారు.వెంటనే అధికారులు సాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సమావేశంలో నాయకులు ఈరి భూమయ్య, వలబోజు నర్సింహాచారి, గూడెపు సుదర్శన్, కేసిరెడ్డి బాల్‌రెడ్డి, స్వామిదాసు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరేశ్ (ఫైల్)

దుబ్బాక,మార్చి9: మండలంలోని ఆకారం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నరేశ్ (30) గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం నరేశ్ తన ద్విచక్రం వాహనంపై బంధువుల గ్రామం ఆకారం వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా అతివేగంతో వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో నరేశ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



సిద్దిపేట టౌన్,మార్చి 9 : సిద్దిపేట పారుపల్లి వీధిలో వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ 55వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకం,గోపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

కోటి తలంబ్రాల దీక్ష భేష్

కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి దంపతులు

గజ్వేల్, మార్చి 9: భద్రాచల సీతారాముల కల్యాణోత్సవానికి అందించే కోటి తలంబ్రాల దీక్షలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి దంపతులు ఆదివారం పాల్గొని గోటితో వడ్లను వలిచి తలంబ్రాలు చేశారు. ఈ సందర్భంగా రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామరాజును ఆయన అభినందించారు.